# రాక్షస ప్రవృత్తి

— ముద్దంశెట్టి హనుమంతరావు

ఆకాశం, అక్కడక్కడ మేఘావృతమై వుంది.

చిన్న చిన్న తుంపర్లు పడుతున్నాయి.

ఏ క్షణంలోనయినా పెద్ద వర్షం కుర వొచ్చుని హెచ్చరిక చేస్తున్నట్టుగా వుంది వాతావరణం.

బైటికి వెళ్ళేందుకు వీలు లేకపోవడం వల్ల గామోసు- ఆఫీసులో అందరూ యెవరి సీటులో వాళ్ళు కూచొని, బుద్ధి మంతుల్లా పని చేసుకుంటున్నారు.

సదానంద, ఓ ముఖ్యమైన కేసు స్టడీ చేస్తూ, డ్రాఫ్టు రాస్తున్నాడు.

రఘు, హడావిడిగా సదానంద దగ్గరికి వచ్చాడు.

"ఇది విన్నావ్రటా సదానందా?" దగ్గర్లో వున్న ఓ స్టూలుని కాస్త ముందుకు లాక్కొని కూచుంటూ అన్నాడు రఘు.

రఘు హడావిడిని గమనించిన సదానంద, రాస్తోన్న డ్రాఫ్టు ఆపేసి, కలాన్ని టేబులుమీద పెట్టి, తలెత్తాడు.

"ఏవిట్రా?" ప్రశ్నించాడు.

"ఎలా చెప్పడమో, అర్థం కావడం లేదురా..." బరువుగా ఓ నిశ్వాసాన్ని వదుల్తూ అన్నాడు రఘు.

సదానందలో ఆరాటం యినుమడించింది. "ఏవిటలా సందేహిస్తున్నావు? ఏమయ్యిందిరా?" ఆతృతగా అడిగాడు.

"మన సుబ్బారావుకి, స్కూటరేక్సిడెంటు అయ్యిందట్రా, ఇప్పుడు హాస్పిటల్లో వున్నాట్ట..."

"సుబ్బారావులు యెంతో మంది వున్నారు. ఏ సుబ్బారావుకి?"

"ఇంకెవరో అయితే, మనకెందుకురా? మన నాటకాల సుబ్బారావు లేడూ, విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ అయ్యాడు వాడికి."

సదానంద, షాక్ తిన్నట్టుగా కాస్త ముందుకు వంగాడు.

"ఆ... అలాగా? కాని, వాడు స్కూటరు నడపడే? ఏక్సిడెంటు యెలా జరిగి వుంటుందంటావు?" సాలోచనగా అన్నాడు సదానంద. అదీ పాయింటే మరి.

"ఏక్సిడెంటు జరగడానికి, స్కూటరే నడపాల్ట్రా? ఎవరి స్కూటర్ మీదో వెనుక సీట్లో కూచుని వెళ్తూ వుండొచ్చు... విశాఖలో వాహనాల రద్దీ అధికం కాదా?" అన్నాడు రఘు.

"సౌవనుకో, ఇంతకీ, నీకు యెవరు చెప్పారీ విషయాన్ని?"

"ఇప్పుడే శాస్త్రి చెప్పాడు."

"శాస్త్రికి యెవరు చెప్పారో?"

"ఎవరో గోపాలావు చెప్పాడట..."

సదానంద, ఆలోచనల్లో పడ్డాడు. తమ స్నేహితులు, విశాఖపట్నంలో యెంతో మంది వున్నారు. వాళ్ళల్లో యే ఒక్కరయినా యీ విషయాన్ని తమకెందుకు ఫోన్లో చెప్పలేదు. ముందుగా తమకి తెలీకుండా, యింకెవరికో యెలా తెలిసింది...? అనుకున్నాడు మనసులో.

"ఆశ్చర్యంగా వుందిరా రఘూ. మనకి సన్నిహిత స్నేహితులు విశాఖపట్నంలో చాలా మంది వున్నారు. వాళ్ళకీ సుబ్బారావు స్నేహితుడే. ఇటువంటిదేదో ప్రమాదం జరిగితే యెవరో ఒకరు మనకి తెలియజెయ్యరంటావా?" సందేహాస్పదంగా అన్నాడు సదానంద.

"అదీ పాయింటే అనుకో. అయితే, ఆ సమయానికి, మన ఫోను దొరకలేదేమో?" రఘు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

నాటకాల సుబ్బారావుకి విశాఖపట్నంలో స్కూటరేక్సిడెంటయ్యిందన్న వార్త ఆఫీసులో గుప్పుమంది. చాలా మంది ఆందోళన చెందారు. నిజమే మరి. నాటకాల సుబ్బారావుగా ప్రసిద్ధికెక్కిన ఆ సుబ్బారావంటే, అందరికీ అభిమానమే ఆ ఆఫీసులో.

అందరిలా ఆందోళన చెంది వూరుకోలేదు సదానంద, రఘూ.

వెంటనే విశాఖపట్నంకి ట్రంక్‌కాల్ బుక్ చేశాడు సదానంద. సుబ్బారావుకి అతి సన్నిహితుడైన చక్రపాణిగారి ఫోనునంబరు అడిగాడు. అదృష్టవశాత్తూ, వెంటనే లైను దొరికింది.

విశాఖపట్నంలో చక్రపాణి ఫోను మోగింది. అతను రిసీవరెత్తాడు.

"హలో... హలో... చక్రపాణీ హియర్..." అన్నాడాయన.

"నమస్కారం సార్. నేను సదానందని... కలకత్తా నించిమాట్లాడుతున్నాను" అన్నాడు సదానంద యిట్నుంచి.

"ఆ... ఆ... చెప్పండి సదానంద గారూ. కులాసాయేనా?"

"ఆ... నేను కులాసాయేనండీ. కాని, మన సుబ్బారావు అదే నండీ. మన నాటకాల సుబ్బారావు యెట్లా వున్నారు. చెప్పడానికి నోరు రావడం లేదు... యిక్కడ ఓ వార్త ప్రచారంలో వుంది. మన సుబ్బారావుకి స్కూటరేక్సిడెంటయ్యిందని, ప్రస్తుతం హాస్పటల్లో వున్నాడనీను. మేం అందరం ఆందోళన పడుతున్నామండీ... అదేవిటి సార్, అలా నవ్వుతున్నారు?" అటువేపు చక్రపాణి నవ్వుతూండటం ఫోన్లో విని, విస్తుపోయాడు సదానంద.

"నవ్వుగాక మరేవిటండీ? ఇప్పుడే, అంటే ఓ అయిదు నిమిషాల క్రితమే నా దగ్గర్నించి వెళ్ళాడు. ఇద్దరం కాఫీ తీసుకున్నాం కూడాను. నిక్షేపంగా వున్న సుబ్బారావుకి యాక్సిడెంటుకి గురిచేసి, హాస్పటల్లో చేర్చారూ అంటే, నవ్వు రాదూ మరి? ఎవరో, వుద్దేశపూర్వకంగా లేవదీసిన పుకారయ్యింటుందది." నవ్వుతూనే అన్నాడు చక్రపాణి.

సదానంద మొహం వికసించింది. స్నేహితుడి ముఖ కవళికల్ని గమనిస్తూనే వున్నాడు ప్రక్కనే వున్న రఘు.

"అయితే మన సుబ్బారావు నిక్షేపంగా వున్నాడన్నమాట..." రిలీఫ్ వచ్చినట్టుగా అన్నాడు సదానంద.

"అన్నమాటే కదా! ఎవడో పనీ పాటూ లేని వెధవ, సుబ్బారావంటే గిట్టని అప్రాచ్యుడు, యీ వార్తని సృష్టించి గాల్లో వదిలేసి వుంటాడు. ఇలా ఓ విధమైన ఆనందాన్ని అనుభవించే వాళ్ళు కొందరుంటారు మరి, సరేగాని, మన మిత్రులందరికీ చెప్పండి, సుబ్బారావు నిక్షేపంగా వున్నాడని అన్నాడు చక్రపాణి.

"అలాగేనండీ. చాలా థాంక్స్. వుంటాను మరి..." కృతజ్ఞతా పూర్వకంగా అంటూ, ఫోను పెట్టేశాడు సదానంద.

అటువేపు చక్రపాణి కూడా, నవ్వుకుంటూ, రిసీవర్ని క్రెడిల్‌పై పెట్టేశాడు.

"ఏం చెప్పాడ్రా?" ఆత్రంగా అడిగాడు రఘు.

సదానంద సన్నగా నవ్వేడు.

"మనం విన్న వార్త వట్టి పుకార్రా రఘూ. ఎవరో, కావాలని గాల్లో వదిలిన పుకారది. సుబ్బారావు యిప్పుడే చక్రపాణి గారి దగ్గరికి వచ్చి వెళ్ళాడట."

తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు రఘు.

"థాంక్ గాడ్. ఇటు వంటి పుకార్లు యెందుకు లేవదీస్తారో అర్థం కాదురా సదానందా!"

"రాక్షస ప్రవృత్తి వున్నవాళ్ళకి, యిదో రకమైన ఆనందంరా!" నవ్వేశాడు సదానంద. "మన వాళ్ళందరికీ యీ శుభవార్త చెబుదాం పద" అంటూ బయల్దేరాడు.

రఘు, సదానంద వెంట నడిచాడు. ఈ పుకారుని యెవరు లేవదీశారా అన్నదే అతని బుర్రలో గిర్రున తిరుగుతోన్న సందిగ్ధం.

* * *

మర్నాడు విశాఖపట్నంలో-

యధాలాపంగా, సుబ్బారావు చక్రపాణి దగ్గరికొచ్చాడు.

"నమస్కారమండీ...! వస్తూనేఅన్నాడు, సుబ్బారావు.

"నమస్కారం... కూచోండి సుబ్బారావు గారూ. మీకో ఫస్టు క్లాసయిన జోక్ చెప్పాలి" నవ్వుతూనే అన్నాడు చక్రపాణి.

"జోకా?" చక్రపాణికి అభిముఖంగా కుర్చీలో కూచుంటూనే ఆశ్చర్యంగా అన్నాడు సుబ్బారావు.

"ఔను. జోకేనండీ. అన్నట్టు మీరు హాస్పిటల్నుంచి యెప్పుడు డిశ్చార్జి అయ్యారండీ?" మందహాసంతో ప్రశ్నించాడు చక్రపాణి.

సుబ్బారావుకి యేవీ అర్థం కాలేదా ప్రశ్న. అయోమయంగా చక్రపాణికేసి చూశాడు.

"ఏవిటండీ మీరంటున్నది. నేను హాస్పిటల్నుంచి డిశ్చార్జి అవ్వడమేమిటి? నేనసలు చేరనిదే" బిక్కమొహం వేస్తూ అన్నాడు సుబ్బారావు.

ఫకాలున నవ్వేడు చక్రపాణి.

"అదేమిటలా నవ్వుతున్నారు?" తెల్ల మొహం వేశాడు సుబ్బారావు.

"నవ్వక యేం చెయ్యమంటారూ? వింటే మీరూ నవ్వుతారు. విషయం యేవిటంటే, మీకు స్కూటరేక్సిడెంటు అయ్యిందనీ, మీరు హాస్పిటల్లో వున్నారనీ; ఓ గాలి కబురు ప్రచారంలోకి వచ్చిందట, కలకత్తాలోని మన ఆఫీసులో. అది విన్న మన మిత్రులు సదానంద, రఘు కంగారు పడిపోయి, నాకు ఫోనుచేశారు. మీ గురించి వివరాలడిగారు. నిజంగా నాకు నవ్వొచ్చిందండీ. మీరు నిక్షేపంగా వున్నారని, అప్పుడే నా దగ్గరికి వచ్చి వెళ్ళారని చెప్పారు. అప్పుడు గాని, వాళ్ళకా కంగారు తగ్గలేదు."

సుబ్బారావు నవ్వుకున్నాడు.

"ఆశ్చర్యంగా వుందండీ. అసలీ గాలి వార్తని యెవరొదిలుంటారంటారు?" అర్థం గాక అన్నాడు.

"ఎవరని చెప్పగలం? ఎవడో, పన్లేని వెధవ అయినా అయ్యుండాలి. లేదా, మీరంటే గిట్టని వాడెవడైనా అయ్యుండాలి. వాడికి యిదో సరదాలా అనిపించిందేమో" ముసిముసి నవ్వుతూ అన్నాడు చక్రపాణి.

"పోనీలెండి. ఎవడి వెర్రి, వాడికానందం. నిజంగా యిది గొప్ప జోకే సుమండీ. మరి, వెళ్ళివస్తానండీ" అంటూలేచాడు సుబ్బారావు.

"కాఫీ తీసుకుని వెళ్ళండి"

"అబ్బే. ఇప్పుడొద్దండీ. పది నిముషాల క్రితమే తీసుకున్నాను."

"సరే. మీ యిష్టం. సదానందకి ఓ వుత్తరం రాసి పడేయండి"

"అలాగేనండీ. సెలవ్" అంటూ నిష్క్రమించాడు సుబ్బారావు.

* * *

కలకత్తాలోని రైల్వే ఆఫీసు పరిసరాల్ని 'గార్డెన్ రీచ్' అంటారు. అక్కడి రైల్వే హాస్పిటలు, చాలా పెద్దది.

ఆ హాస్పిటల్‌లో కేజువాలిటీ వార్డులో ఒక బెడ్ మీదున్నాడు నరహరి. అతని మొహంలో విషాదచ్ఛాయలు ముసురుకొని వున్నాయ్. అతని కళ్ళు లోతుకు చొచ్చుకుని వున్నాయ్. అతనిలో యేదో తపన, యేదో ఆవేదన, అంతర్గతంగా సంక్షోభాన్ని రేకెత్తించినట్టు అతని మొహం చూస్తే యిట్టే తెలిసిపోతోంది. అతని కుడి కాలుకో కట్టు, యెడమ చేతికో బ్యాండేజ్ వున్నాయి. నుదుటిమీద ఓ చిన్న దెబ్బకి దూది వేసి కట్టారు.

సదానంద, రఘు, నరహరిని చూడ్డానికి వచ్చిన రోజు అదీ అతని పరిస్థితి.

నరహరి, సదానంద, రఘులకు సహోద్యోగే. అయితే నరహరి అంటే, వాళ్ళాఫీసులో చాలా మందికి చుక్కెదురు. కారణం నరహరి ప్రవర్తనే. నలుగురితో కలసి మెలిసి వుండటం అతనికి చేతకాదు. ఎదుటి వ్యక్తిని అభిమానించడం, అతని డిక్షనరీలో లేదు. అందుకే, అతణ్ణి చూడ్డానికి కూడా యెవరూ రాలేదు.

అయితే, అందరూ ఒకేలా వుండరు కదా! సదానంద, రఘు మాత్రం అదేమీ పట్టించుకోకుండా, మానవతా దృక్పథంతో నరహరికి యాక్సిడెంటు అయ్యిందని చూడ్డానికి వచ్చారు.

"నమస్కారమండీ నరహరి గారూ..." ఇద్దరూ ఒకేసారి విష్ చేశారు.

"నమస్కారమండీ. కూచోండి..." అన్నాడు నరహరి.

సదానంద, రఘు ఒకే బల్లమీద సర్దుక్కూర్చున్నారు.

"మీకు స్కూటరేక్సిడెంటయ్యిందనివిని, చాలా వించారించామండీ. స్కూటరు నడిపే వాళ్ళ నిర్లక్ష్యమో, లేక రోడ్డుపై నడుస్తున్న వాళ్ళ అజాగ్రత్తో తెలీదు గానీ, యిటువంటి యాక్సిడెంట్లు అధికమై పోతున్నాయండీ. మీ దురదృష్టం కాకపోతే, రోడ్డు మీద నడుస్తున్న మిమ్మల్ని స్కూటరు ఢీ కొనడమేమిటి?" సానుభూతిగా అన్నాడు సదానంద.

నరహరి భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఇంకా నయమండీ. తక్కువ దెబ్బలతో బైటపడ్డాను. ఒక విధంగా అదృష్టవంతుణ్ణే!"

"ఈ స్థితిలో మిమ్మల్ని చూస్తుంటే, మాకు యెంతో బాధగా వుందండీ నరహరి గారూ" అన్నాడు రఘు.

నరహరి, భారంగా ఓ నిశ్వాసంవదిలాడు.

"సభ్యత కొద్దీ మీరుబాధపడుతున్నారు గాని, నా కుత్సితపు ఆలోచనకి, కుతంత్రపు బుద్ధికి, యింకా నాకు చాస్తి జరగాల్సిందేనండీ. ఈ కొద్దిపాటి శిక్ష చాలదు" రుద్ధ స్వరంతో అన్నాడు నరహరి. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

నరహరి మాటలు, అతని కళ్ళల్లోని అశ్రువుల్లు, ఆశ్చర్యాన్ని కలిగించాయి సదానందకి, రఘుకి పరస్పరం మొహాలు చూసుకున్నారు. "ఏవిటండీ మీరంటున్నది?" విస్తుపోతూ అన్నాడు సదానంద.

నరహరి, బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఔను సదానంద గారూ. కుత్సితపు టాలోచనతో ఒకరి చెడుని కోరి ఆలోచిస్తే, లేదా ప్రచారం చేస్తే, ఆ చీకటి తలపులు యెదురు దెబ్బ తీయక మానవండీ. ఈ సత్యాన్ని, యిప్పుడు స్వానుభవంతో తెలుసుకున్నాను" పశ్చాత్తాపంతో కృంగిపోతూ అన్నాడు నరహరి.

సదానంద, రఘు మళ్ళీ పరస్పరం మొహాలు చూసుకున్నారు. నరహరి మాటల్లోని అంతరార్థం యేవిటో వాళ్ళకి అర్థం కాలేదు.

"మీరంటున్నదేవిటో, మాకేవీ అర్థం కావడం లేదండీ నరహరి గారూ. ఎవర్ని గురించి మీరు కుత్సితపు టాలోచనలు సాగించారంటారూ?" సూటిగ ప్రశ్నించాడు రఘు.

నరహరి ఓ సారి నిర్లిప్తంగా వాళ్ళకేసి చూసి, మొహం దించుకున్నాడు.

"మన నాటకాల సుబ్బారావుకి, విశాఖపట్నంలో స్కూటరేక్సిడెంటు జరిగినట్టు అతడు హాస్పిటల్‌లో వున్నట్టు యీమధ్య ఓ పుకారు విన్నారు కదా?" అన్నాడు.

"ఔనండీ, విన్నాం. మేమందరం చాలా కంగారుపడ్డాం. వెంటనే విశాఖపట్నం ఫోను చేసి, మన చక్రపాణి గారిని కాంటాక్టు చేసి, విషయం యేవిటా అని అడిగాం. ఆయన నవ్వేశాడు. అది నిజం కాదని, వట్టి గాలి కబురేనని, యెవరో బుద్ధి పూర్వకంగా ఆ పుకారుని వదిలారని, సుబ్బారావు నిక్షేపంలా వున్నాడని, అయిదు నిమిషాల క్రితమే తన దగ్గరికి వచ్చాడని చెప్పాడు. అప్పుడు గాని, మా మనసులు కుదుట పడలేదంటే నమ్మండి. ఔనూ, ఆ విషయానికీ, మీకూ యేం సంబంధం వుందండీ నరహరి గారూ?" సూటిగ అతని మొహంలోకి చూస్తూ అన్నాడు సదానంద.

"ఆ పుకారుకి గ్రంథకర్త యెవరంటారు?" యెదురు ప్రశ్న వేశాడు నరహరి.

"ఆ వెధవ యెవడో తెలిస్తే, వూరుకుంటామటండీ?" వుక్రోషంతో అన్నాడు రఘు.

నరహరి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగినయ్. "ఆ వెధవను నేనేనండీ" కళ్ళు వత్తుకుంటూ అన్న నరహరి గొంతు బొంగురు పోయింది.

సదానంద, రఘు అప్రతిభులై క్షణం అచేతనంగా వుండిపోయారు.

"మీరా?" ఆశ్చర్యంతో కళ్ళింతయి చేసుకుంటూ, సదానంద, రఘు ఒకేసారి అన్నారు.

"ఔనండీ! ఆ వెధవన్నేనే. సుబ్బారావులాంటి ఓ సజ్జనుడిపై, సహృదయుడిపై, అకారణంగా అట్లాంటి అసత్యపు ప్రచారం లేవదీసినందుకు, భగవంతుడే నాకిప్పుడీ శిక్ష విధించాడేమో ననిపిస్తోందండీ! అనిపించడమేమిటి? అది వాస్తవం కూడాను. నేను ప్రచారం చేసిన సంఘటనే నాకు శిక్ష య్యింది." పశ్చాత్తాపంతో దహించుకు పోతున్నట్టు, గాద్గదిక స్వరంతో అన్నాడు నరహరి.

"మీరు యెందుకలా ఆ పుకారుని లేవదీశారండీ. దాని వల్ల మీకొచ్చే లాభం యేవిటండీ నరహరిగారూ?" ప్రశ్నించాడు సదానంద.

"ఏముందండీ? కేవలం నాలో చోటు చేసుకున్న అసూయా ద్వేషాలే, నా చేత యీ నికృష్టమైన పని చేయించాయండీ. సుబ్బారావు యిక్కడున్నప్పుడు, అతను అందరి దగ్గరా పొందుతున్న ప్రశంసల్ని, మన్ననల్ని చూసి ఓర్వలేక పోయాను. ఆ అసూయే, క్రమంగా ద్వేషంగా పరిణమించింది. అతను, యిప్పుడు విశాఖపట్నంలో వుండటం వల్ల, యీ పుకారు లేవదీసే అవకాశం చిక్కింది. ఏదో విధంగ అతనికి కాస్తంతయినా మనస్తాపం కలిగించాలన్న నా ప్రయత్నంలోని భాగమే, ఈ పుకారు..." అంటూ ఆగిపోయాడు.

రఘు కళ్ళు, యెర్రబడ్డాయి. మొహం జేవురించింది.

"మీరు మనుషులు కారండి నరహరి గారూ. మీలో యేకోశానా, మానవత్వం లేదు. ఒకరి శ్రేయస్సునే కాంక్షించాలి గాని, వారిపై చెడును ప్రచారం చేసే కుటిల స్వభావం, మీ వంటి వారికే చెల్లు. మీరు యింతటి కుటిల స్వభావులు గనుకనే, మీరీ ప్రమాదానికిగురయి, హాస్పిటల్లో వున్నా, మిమ్మల్ని సానుభూతితో చూడ్డానికి కూడా యెవ్వరూ రాలేదు చూశారా! మేం దేన్నీ అంతగా పట్టించుకోం గనక వచ్చాం. మీ నోట యిప్పుడీ విషయం విన్నాక..." అని రఘు వుద్రేకంతో చెప్పకు పోతుంటే సదానంద చప్పున అడ్డు పడ్డాడు.

"రఘూ, నీలో వుద్రేకం పెరగడం సహజమేరా! కాని, ప్రస్తుతపరిస్థితిలో ఆవేశం అవాంఛనీయం. నరహరిగారు, ప్రస్తుతం కష్టంలో వున్నారు. వారికిప్పుడు కావల్సింది సానుభూతి! జరిగిందేదో జరిగిపోయింది. ఆయన చెప్పకపోతే, మనం యేం చేసి వుండే వాళ్ళం చెప్పు? తన తప్పును తెలుసుకున్నారు గాబట్టే, గుండెల్లోని బరువును దించుకోడానికి నిజం చెప్పేశారు. దీన్ని మనం హర్షించాలిరా..." మెల్లగా అన్నాడు సదానంద, రఘుని శాంత పరుస్తూ.

రఘు, తన తొందర పాటుని గ్రహించాడు గామోసు. మొహం దించుకున్నాడు.

నరహరి, కళ్ళల్లో నీరు నింపుకుని ఒక చేత్తోనే రఘుచేయి పట్టుకున్నాడు.

"రఘుగారూ, మీరు ఆవేశపడ్డారని, నేనేవీ బాధ పడ్డం లేదండీ. నా తప్పుకి, ఆ భగవంతుడే శిక్ష విధించాడు. సగం చచ్చిన యీ పాముని యింకా చావబాదడమెందుకు చెప్పండి?" అన్నాడు.

నరహరి కళ్ళ వెంబడి బొట బొటా కన్నీరు కారి, చెక్కిళ్ళపైకి జాలువారింది.

రఘు, మరేం మాట్లాడలేకపోయాడు.

సదానంద అందుకున్నాడు.

"నరహరిగారూ, పశ్చాత్తాపానికి మించిన శిక్ష లేదండీ. గతాన్ని విస్మరించి, యికనైనా మీలో మార్పు రావాలి. ఒకరికి సహాయం చెయ్యకపోయినా, అపకారం చెయ్యాలన్న తలంపే వుండకూడదు. అదే మానవత్వానికి మొదటి సూత్రం. అందరితోనూ సామరస్యంగా వుండాలండీ. మీరు త్వరగా కోలుకోవాలని కాంక్షిస్తున్నామండీ. మరి, మాకు సెలవిప్పించండి" అంటూ లేచాడు సదానంద.

రఘు కూడా లేచాడు.

నరహరి కళ్ళల్లో కృతజ్ఞతా భావం పొడజూపింది.

"మీరిద్దరూనన్నిలా చూడ్డానికి వచ్చినందుకు ధన్యవాదాలండీ. సుబ్బారావు పట్ల నేను వ్యవహరించిన తీరుకి, నేనే సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమిస్తారనుకుంటాను. మీరన్నట్టు, నేను మారాలి. మారుతాను కూడా" రుద్ధ స్వరంతో అన్నాడు నరహరి.

"వస్తానండీ" అన్నాడు రఘు.

అప్రయత్నంగా నరహరి రెండు చేతులూ అతికష్టమ్మీద జోడించి, వాళ్ళని సాగనంపాడు సజల నేత్రాలతో.

అతనిలో మార్పుకి అది నాందీగీతం!